# రక్త స్వభావం

"కుయ్యి"మని సైరన్ కూసింది....

సైకిల్ షెడ్లో బొగ్గు దుమ్ములో పడుకున్న గని కార్మికులు ఉలిక్కిపడి లేచారు.... చెంద్రయ్యా నోరుతెరచి ఇంకా గుర్రుపెడుతున్నాడు.... అతని ముఖం మీద చెమట చుక్కలు దుమ్ముపడి బొగ్గు నెరుసులు మొఖం మీదున్నట్టుగా వున్నాయి. రామలింగు చెంద్రయ్యను అటుఇటూ ఊపాడు.

"లే... లేయే సెంద్రన్న సైరన్ గూసింది...."

చెంద్రయ్యా లేచి కూర్చొని ముఖం తుడుచుకున్నాడు. అప్పటికే చాలామంది క్యాబిన్ దగ్గర లైట్లు తీసుకుంటున్నారు....

"ఇయ్యాల్ల నల్గురు దన్ని ముగ్గురీడ్సినట్టుగున్నది....నాత్రంత నిదురలేదు. యూనియనోల్లచ్చి పట్టుకపోయిండ్లు... సభల ఏందో సెప్పిండ్లుగని, బల్లలు మోసిమోసి సచ్చినం..." చెంద్రయ్యా ఆవులించి లేచాడు.

"ఇంటికాన్నే ఉండనుంటివి. ఎండల గంత దూరం నుంచచ్చి హాజరు పోగొట్టుకుంటెట్ల?" రామలింగు ఎండలో నడుస్తున్నాడు.

"గిట్లజేత్తనే సాల్తలేదు... ఈళ్లే లాంగ్ బారుసేత్తమని బెదిరిత్తండ్లు..."

ఇద్దరూ క్యాబిన్ దగ్గర లైట్లు తీసుకొని హాజరు చెప్పినారు....

"ఎండలు ముదురుతన్నయ్... బాయి దొరలవ్వల కుక్కల్.. బొగ్గో బొగ్గని సత్తరు గని లోపట మంచినీళ్లనేరా? మంచి గాలనేరా..." చెంద్రయ్యా గొణిగాడు.

మరో గంట తరువాత గనిలో బత్తి పేలింది.... చెంద్రయ్య, రామలింగు తట్టలు, సెమ్మసులు పట్టుకొని కూలిన బొగ్గు పెళ్లలదగ్గరికి నడిచారు.

రామలింగు నిట్టనిలువునా నిలుచుండి తలెత్తి చూశాడు.... నెత్తిమీద గులాయి కప్పు కొంచెం నెర్రెబాసినట్లుగా తోచింది....

"సెంద్రన్న గిది సూడే... మొఖద్దమ్ను బిలువు...." ఆదుర్దాగా అన్నాడు... వంగిన చెంద్రయ్యా నిలబడి కప్పుకేసి చూశాడు....

"ఆఁ గాదానితో నేమయ్యిద్ది? ఆ నాలెముచ్చుకొడుకేడ సచ్చిండో? పటు... పటు... నాలుగు టబ్బులు జెట్ మనేటాల్లకు ఇద్దరి పొత్తుల నింపుతె పీడ పోతది." చెంద్రయ్యా సెమ్మసును బొగ్గుకు గుచ్చి తట్ట నింపిండు- రామలింగు తట్టెత్తుకుని లాడీసువేపు నడిచాడు.

చెంద్రయ్య ఏదో ఊరుపేరు లేని పాటెత్తుకుని రెండోసారి సెమ్మసును బలంగా బొగ్గు కుప్పకు కుచ్చిండు... అంతే 'బడెల్లున' శబ్దమయింది... కప్పు కూలింది... రామలింగు వైనుదిరిగి చూసేటప్పటికి చెంద్రయ్య బొగ్గు పెళ్లకింద పడి గిలగిల తన్నుకుంటున్నాడు... కూలిన పెళ్ల బొగ్గుకుప్ప వేపు కూలింది. కొస చెంద్రయ్య మీద పడ్డది.... తలనుంచి నెత్తురు చిమ్మెన గొట్టంలో నుంచి చిమ్ముతున్నట్లుగా చిమ్ముతోంది... అప్పటికే చాలామంది అక్కడ పోగయ్యారు.... పది నిముషాల్లో చెంద్రయ్యను బయటకు తీశారు.

స్ట్రైచర్ కోసం మనిషి ఉరికాడు.... అందుబాటులో ఏ బాయి-దొరా లేడు. నెత్తురు కారుతున్న చెంద్రయ్యను బాయి వెలుపలికి తీసుకొచ్చేసరికి మరో గంట గడిచింది... చెంద్రయ్య స్పృహతప్పిపోయాడు.

ఫోర్‌మన్ గొణ్కుంటూ వచ్చాడు- వచ్చి అంబులెన్సు కోసం హాస్పిటల్‌కు ఫోన్ చేస్తే అవతలి కంఠం....

"అంబులెన్స్ డాక్టరుగారి అమ్మగారిని బజారుకు తీసుకపోయింది. వచ్చిన తరువాత పంపుతాం" అంది.

అంతలోనే అండర్ మేనేజరు కారులో వచ్చాడు. యాకూబ్ కారుకోసం మేనేజరును బతిమిలాడాడు.... మేనేజర్ గురగురలాడాడు. చెంద్రయ్య తలనుండి ఇంకా రక్తం కారుతూనే ఉంది.....

మరో గంటకు అంబులెన్స్ వచ్చింది... చెంద్రయ్యను అంబులెన్సులో ఎక్కించారు...

"ఎక్కుండ్లి... ఎక్కుండ్లి... వానికి రక్తం గావాలె.... గ్రూపు కలువాలె. ఒరే మైషిగా, దుడ్డెకు దుడ్డె ఉన్నవ్... వెనుకకు పోతున్నవేంటే... ఎక్కు... తోటి కార్మికుడు గాయపడితే రక్తం దానం చెయ్యటానికి వెనుకముందాడద్దు" అండర్ మేనేజర్‌గారు నీతిబోధలు చేస్తున్నారు.

ఎవడో చప్పిడి దవడల పడుసోడు బొంగురు గొంతుతో అరుస్తున్నాడు...

"అదె ఎర్రగొర్రోలె బాగా బలిసినవ్... నువ్విత్తేంది నెత్తురు. మా సెత్తల్ల నెత్తురుంచినారు... దినానికింత పిండుకొని ఉత్తకట్టె మిగిల్చిండ్లు- నేను నూడు ముప్పయేండ్లకే ముసలోన్నయిపోయిన... బాయిల గాలిలేక ఉన్న నెత్తురు మరిగిపోయింది... మాటలకేంది? నేను జెప్పుత..."

అండర్ మేనేజరు.... కొరకొర చూశాడు....

ఫోర్‌మన్ కంగారుపడిపోయి ముఖం మాడ్చుకొని-

"తల తిరుగుతుందా బే..." అన్నాడు కోపంగా....

"తల తిరుగుతే మంచిగనే ఉంటది... అంబులెన్సులు దొరల పెండ్లాలు బజార్లు తిరుగటానికున్నయా?" యాకూబ్ కలుగజేసుకున్నాడు....

అంబులెన్స్ కదిలింది... ఫోర్‌మన్ కొందరిని బలవంతంగా అంబులెన్సులోకి తోసి తలుపేశాడు....

గడగడ శబ్దం చేస్తూ... అంబులెన్స్ ఎడ్లబండి తీరుగా ఎత్తేస్తే హాస్పిటల్ చేరుకునేసరికి చెంద్రయ్య పరిస్థితి విషమించింది... అక్కడ కార్మికుల నుంచి రక్తం తీస్తే ఎవడి గ్రూపు కలువలేదు. "రక్తం ఎక్కియ్యకుంటే చెంద్రయ్య బతకడం కష్టం. అటెన్క మీ యిష్టం" అని డాక్టరు చెప్పివెల్లి తన రూంలో కూర్చున్నాడు.

యాకూబు ఏజెంటుకు ఫోన్ చేశాడు... ఏజెంటు ఇంగ్లీషులో తిట్టాడు... యూనియన్ ఆఫీసుకు ఫోన్ చేశాడు.... "రక్తం కోసం సమ్మె చేద్దామంటావా?" యూనియన్ సెక్రటరీ అవతలి వేపునుంచి నవ్వుతున్నాడు....

"అవతల ప్రాణం పోతుంటే ఎవడికీ పట్టినట్టు లేదు...." యాకూబు.

"డాక్టర్ సాబ్ - వేరే దారిలేదా?" యాకూబు డాక్టర్ రూంలో.

"గోదారే. 'బి' నెగెటివ్ గ్రూపువాన్ని తీసుకురాండ్రి" అన్నాడు డాక్టర్.

"మేం సావు బతుకుల్లో ఉంటే మీరు సరసాలాడుతండ్లు... బొగ్గు బుక్కి బొగ్గెర్రి పానాలను సుత లెక్క సెయ్యకుంట బొగ్గు తవ్వి ఈతలబోత్తె తమరు కడుపుల సల్ల కదులకుంట గాలి పంఖలకింద కూసుండి తింటండ్లు- సెందురన్నను బతికించ్చుండ్లి - ఇగో సార్! ఏదన్న చెయ్యిండ్లి." అక్కడున్న అధికారులు ఎవరూ రక్తమివ్వడానికి ముందుకు రాలేదు.

రామలింగు రక్తం గ్రూప్ కలువలేదు. మల్ల అంబులెన్సు కార్మికుల కోసం పరుగెత్తింది.

కార్మికుల్లో కలకలం బయలుదేరింది-

ఇంతలో చెంద్రయ్య చనిపోయినట్టుగా డాక్టరు చెప్పాడు-

యాకూబు కార్మికులను వెంటబెట్టుకొని యూనియన్ ఆఫీసుకు వెళ్లాడు. యూనియన్ వాళ్లు నీతులు చెప్పారు-

కార్మికులు ఏజెంటు దగ్గరికి వెళ్లారు. ఏజెంటు పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేశాడు. పోలీసులు వచ్చేసరికే ఏజెంటు తల బద్దలయ్యింది. పోలీసులొచ్చి కార్మికుల తలలు బద్దలు కొట్టారు- కొందరిని వ్యానులో ఎక్కించుకుపోయారు-

కుషన్ సీట్ల కారులో ఏజెంటు హాస్పిటల్‌కు చేరేసరికి డాక్టరు కారు డోరు తెరిచాడు. ఫోర్‌మెన్‌లు, అండర్ మేనేజర్లు, రక్తమిస్తామని లైనుగా నిలుచున్నారు. అతనిది 'బి' నెగెటివ్ అయినా దొరికింది. అరగంటలో ఏజెంటు ఇంగ్లీషులో కార్మికులను తిట్టే స్థితికి వచ్చాడు.

చెంద్రయ్య శవంమీద పడి చెంద్రయ్య భార్య, పిల్లలు హృదయవిదారకంగా ఏడుస్తున్నారు-

రామలింగు శవ దహనానికి చందాలు జమ చేస్తున్నాడు. యాకూబు మిగతా కార్మికులు పోలీసు ఠానాలో బోనులోని సింహాల్లా తిరుగుతున్నారు-

❄

ఆనందజ్యోతి వారపత్రిక 16-04-79